క్లుప్తంగా

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ రిజ్వాన తాన్విర్ ఆధ్వర్యంలో 36 మందికి న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి 500 గ్రాముల నెయ్యిని పంపిణీ చేయాలని సూచించారు. త్వరలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, సోని, జయమ్మ, అనూష, పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు



గట్టు: వడదెబ్బ రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని రైతులకు, కూలీలకు సీహెచ్ఓ ఊసేని, హెల్త్ సూపర్‌వైజర్ మక్బూద్‌లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామ శివారులలో పని చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వారు అందజేశారు. ఉదయం 11 గంటల వరకు పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు రావాలని కోరారు. తలపై తడి గుడ్డను వేసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను వెంట పెట్టుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం



మల్దకల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్ సూచించారు. శుక్రవారం ఎల్కూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. రోడ్డు నియమ నిబంధనలను వివరించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు రాధ, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని స్కంద ప్లాట్స్ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారని ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఇసుక ట్రాక్టర్ పంచలింగాలకు చెందిన బోయ మద్దిలేటిగా గుర్తించామని పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన కమ్మరి రమేష్, వడ్డె హనుమంతులు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శుక్రవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మృతుల కుటుంబ సభ్యులకు రూ. 5000 చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు గట్టుబాబు, రాజు, పాండు, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



రాజోళి: మండలంలోని పచ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 మంది విద్యార్థులకు కళ్లు, దంతాల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భోజనానికి ముందు, మలవిసర్జన అనంతరం చేతులు శుభ్రంగా చేసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు'



గట్టులోని రాయాపురంలో ..



మానవపాడులోని కడుకుంట్లలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ యాకుబ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కలుకుంట్లలో నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరంలో 134 మందికి పరీక్షలు చేశారు. 11మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేయగా, 9 మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 59 మంది పురుషులు, 65 మంది మహిళలు మొత్తం 124 మంది పరీక్షలు చేయించుకున్నారు. క్యాతూర్ పీహెచ్‌సీలోని లింగన్‌వాయిలో 95 మంది పురుషులు, 71 మంది మహిళలు మొత్తం166 మందికి పరీక్షలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంటి వెలుగు పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూణరాణి, వైద్యులు రామస్వామి, హేమమానస, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, సూపర్ వైజర్ గురుబసయ్య, శ్యామలదేవి, సురేఖ, పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని రాయాపురం, మిట్టదొడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో మొత్తం 296 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 10 మందికి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేయగా, 14 మందికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిమ్మప్ప, నరేష్, హెల్త్ సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎన్ఎంలు షాహీన్, ఖేజీయా, ఆశాలు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన వీఆర్‌ఏలు



చల్లాను కలిసిన అలంపూర్ వీఆర్‌ఏలు

ఉండవెల్లి: అలంపూర్ నియోజకవర్గంలోని వీఆర్‌ఏలు మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని శుక్రవారం కర్నూల్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వివరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోవింద్, లక్ష్మణ్, కృష్ణ, నారాయణ, మమత. నాగవేణి, మల్లేశ్వరి, జహీదా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైష్ణవికి అభినందన

మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వైష్ణవి కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించడంతో మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

అలంపూర్: పార్టీ బలోపేతానికి కలికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలానికి చెందిన వాల్మీకి నాయకులు మాజీ ఎమ్మెల్యే చల్లాను కర్నూల్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, చక్రపాణి రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ

శాంతినగర్: వడ్డేపల్లి మాజీ ఎంపీపీ కొంకల నాగేశ్వర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ సతీమణి కొంకల సర్పంచ్ వరలక్ష్మమ్మ వారం రోజుల కిందట మృతి చెందింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. చల్లా వెంట మహిపాల్‌రెడ్డి, మాబిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, నరేంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఈదమ్మ గుడి సమీపంలో సాధారణ తనిఖీలో పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదిశిలా క్షేత్రానికి వెండి దీపాలు వితరణ



ఆదిశిలా క్షేత్రంలో వెండి దీపాలు వితరణ చేస్తున్న దాతలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి శుక్రవారం కర్నూల్ జిల్లా, కోడుమూరు పట్టణానికి చెందిన భక్తులు పెద్దసిద్దన్న, రంగస్వామి కుటుంబ సభ్యులు 500 గ్రాములతో తయారు చేసిన రెండు వెండి దీపాలను స్వామి వారికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు దాతలకు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, అరవిందరావు, దీరేంద్రదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.నర్సింహా

అలంపూర్ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.నర్సింహా అన్నారు. మండలంలోని లింగన్‌వాయి, క్యాతూర్ గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం కార్మికుల పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌నునాయన విడుదల చేశారు. అనంతరం నర్సింహా మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 28వ తేదీ వరకు గ్రామ పంచాయతీ కార్మికుల యాత్ర చేపట్టినట్లు వివరించారు. చివరిరోజు హైదారబాద్‌లోని ఇందిరపార్క్ దగ్గర భారీ బహిరంగ సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఉర్సును జయప్రదం చేయండి



ఫ్లెక్సీలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్ షా రాజావలి దర్గా షరీఫ్ ఉర్సును మార్చి 10 నుండి 12 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటి సభ్యులు మైను, రఫీక్, ఫరీద్ తెలిపారు. శుక్రవారం నమాజు అనంతరం దర్గా ఆవరణంలో ఉర్సు సంబంధించిన ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఎంతో చరిత్ర కలిగి, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడిగా పూజలందుకుంటున్న రాజావలి దర్గాకు ఏటా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారని వెల్లడించారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మే ఖురాన్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఖవ్వాలి ఉంటుందన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



జూరాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



అమరచింతలో..

ఆత్మకూర్: మండలంలోని జూరాలలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, సీఆర్పీ సౌమ్యరాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలికల పాఠశాలలో..

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులను అందించారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



బుక్కాపూర్‌లో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి



కొంకలలో మాట్లాడుతున్న బంగారు శృతి

అలంపూర్ రూరల్: పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. మండలంలోని బుక్కాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 80 కోట్ల మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున ఉచిత బియ్యం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఈశ్వర్, నరేష్, గొంది‌మల్ల లక్ష్మణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్: దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 18 గంటలు శ్రమిస్తున్నారని బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ రాజుగౌడ్ ఆధ్వర్యంలో ప్రజాఘోష బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ అవినీతి కుటుంబపాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధన్న, జలగరి అశోక్, మధుసూదన్‌గౌడ్, బంగిలక్ష్మణ్, హరికృష్ణ, నరసింహరావు, శ్రీను, పాల్గొన్నారు.

మల్దకల్: అన్ని రంగాల్లో బీఆర్ఎస్ విఫలం అయ్యిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఉలిగేపల్లి, దాసర్‌పల్లి, బిజ్వారం గ్రామాలలో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో విఫలమైందన్నారు.

గద్వాల: సీఎం కేసీఆర్ రైతు సంక్షేమాన్ని గాలికొదిలేశారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాల్వాయి రాముడు విమర్శించారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు ఉత్తమ రైతులను సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ చేయాలన్నారు.

అయిజ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని ఉప్పలలో ప్రజా గోస- బీజేపీ భరోస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కంపు.. కంపు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పురపాలికలో వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడులో ఉన్న పది వార్డులలో మురుగుతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల అక్కడక్కడ సీసీ రోడ్లు వేసినప్పటికీ డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. కాలనీవాసులు దుర్గంధ వాసన భరించలేకపోతున్నారు. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని ఆయా కాలనీవాసులు వాపోయారు. మున్సిపాలిటీకి రూ.5 కోట్లు మంజూరైన పూర్తి స్థాయిలో డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మురుగుకాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



శాంతినగర్ పట్టణం కోయిలదిన్నె రోడ్డులో..

పక్కాగా సర్వే పనులు



సర్వేయర్‌కు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: మాస్టర్ ప్లాన్ సర్వే పనులు తప్పులు లేకుండా పక్కాగా చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. పట్టణంలో శుక్రవారం చేపట్టిన పట్టణ మాస్టార్ ప్లాన్ సర్వే పనులను ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీలో అనుబంధ గ్రామాలైన తుపత్రాల, పర్దిపురంలను పరిగణలోకి తీసుకొని సర్వే చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ భవనాలు, బ్యాంకులు, సెల్ టవర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, పబ్లిక్ రెసిడెన్సియల్స్ లాంటివి గుర్తించి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని కోరారు. సర్వే పూర్తయిన అనంతరం పట్టణానికి సంబంధించిన మ్యాప్ ఇస్తామని సర్వేయర్ కమిషనర్‌కు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, అసిస్టెంట్ సర్వేయర్ పవన్ కళ్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



ఇందువాసిలో ఎల్ఓసీ లెటర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి

గట్టు: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇందువాసి గ్రామానికి చెందిన పద్మమ్మకు రూ.2లక్షలు, బింగిదొడ్డి తండాకు చెందిన శిరీషకు రూ.1.25లక్షలు మంజూరు అయ్యారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులకు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, తిమ్మప్ప, మేస్త్రీ తిమ్మప్ప, డీలర్ తిమ్మప్ప, నరేందర్‌నాయక్, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు వంద మందికి 'ఉపాధి'



నర్సరీని పరిశీలిస్తున్న పీడీ నాగేంద్రం

రాజోళి: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి రోజూ వంద మందికి తగ్గకుండా కూలీ పనులు కల్పించాలని పీడీ నాగేంద్రం అన్నారు. మండలంలోని పచ్చర్లలో నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నర్సరీల్లో ఎన్ని రకాల మొక్కలు ఉన్నాయని, అవి ఏ దశలో ఉన్నాయని, వాటి రక్షణ చర్యలు చేపడుతున్న పద్ధతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో మొక్కలు ఎండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందు రావు, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మందు వేస్తున్న పశువైద్య సిబ్బంది

అయిజ: జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తొత్తినోనిదొడ్డి సర్పంచ్ మహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నతాండ్రపాడు, వేణిసోంపురం, తొత్తినోనిదొడ్డి, మూగోనిపల్లి గ్రామాల్లో వెటర్నీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను తాపించారు. శనివారం మండలంలోని ఉత్తనూరు, ఈడుగోనిపల్లి, భూంపురం గ్రామాల్లో నట్టల నివారణ మందులు వేస్తామని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూపరాణి పేర్కొన్నారు.

చిన్నారుల హాజరుశాతం పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎర్రవల్లిచౌరస్తా: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. శుక్రవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నారులకు ప్రతిరోజు కూడా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులకు, బాలింతలకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మానవపాడు: మండలంలోని జల్లాపురం రైతువేదికలో శుక్రవారం పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా రూ. 5335 మద్దతుతు ధరతో శనగ కొనుగోలు చేస్తునట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రం తీసుకోని విక్రయించాలని రైతులకు సూచించారు. ఎకరాకు 5.25 కేజీలను కొనుగోలు చేస్తామని రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ మద్దిలేటి, స్టాఫ్ అసిస్టెంట్ ప్రభాకర్‌నాయుడు రైతులు పాల్గొన్నారు.